# 9

## ద్వైజటం

ఆఫీసు విడిచిన తర్వాత శివరావు నేరుగా సముద్రపు వొడ్డుకు నడిచాడు. నెల రోజులనుంచీ ఇదొక అలవాటైపోయిం దతడికి. ఇదివరలో ఆఫీసునుంచి నేరుగా ఇంటికి వెళ్ళేవాడు. ఇప్పుడు ఇంటికి పోవాలంటే అతడికి యెక్కడలేని దిగులూ పట్టుకుంటుంది. భయం కూడా.

ఇవాళ అతని మనసంతా చీకాకుగా ఉంది.

అనవసరంగా పైవాడు తన తెలివి ఉపయోగించుకున్నాడు. వాడు కాకా పట్టడంలో ప్రవీణుడై గబగబా పైకొచ్చేశాడు. వాడికి కష్టసుఖాలు తెలీవు. చచ్చేటంత అహంభావం. వాడు స్కూలు ఫైనలే అయి ఉద్యోగంలో ప్రవేశించి డబ్బా మంత్ర ప్రభావంచేత చప్పు చప్పున పైకి గెంతాడు. అందుకని వాడికంటే యెక్కువ చదువు కున్నవాణ్ణి చూస్తే వాడికి నిర్లక్ష్యం.

ఏమిటీ కారణం? తెలీకుండా ఉంది. శశి ఉత్తరం వ్రాయలేదు. అంచేతనే తన కింత దిగులు. ఇవాళ శనివారం. ఇవాళ ఉత్తరం వస్తుందన్న ఆ ఆశన్నా ఉంటే త్వరగా కొంపచేరుకునేవాడు. దార్లో కాస్త కాఫీ తాగాడు. బిల్లు చెల్లిస్తూంటే యెదురుగా ఉన్న అద్దంలో తన ముఖం తన్ను చూసి జాలిపడ్డది. "ఇలాగయిపోయావేం?" అంది. శివరావు తన ముఖానికి సమాధానం చెప్పలేదు. సమాధానం చెప్పటానికేముంది గనుక! "నీకు తెలీదా?" అన్నాడు. అనుకున్నాడు. మెట్లు దిగుతుంటే అందమైన దృశ్యం వొకటి కనిపించిందతడికి.

అందంగా వుంది ఆ అమ్మాయి. ఆనందంగా ఉన్నా డా అబ్బాయి. ఇద్దరూ కాఫీ త్రాగటానిక్కా మోసు వెళుతున్నారు. శివరావు నిట్టూర్చాడు. శశి ఉత్తరం వ్రాయలే దెందుకో? పదిరోజులయింది— అనుకున్నాడు.

సముద్రపుటొడ్డున కూచున్నాడు. అతడికేం తోచడంలేదు. ఇంకా ఎండ కాస్తూనే ఉంది. పండు టెండ.

గుప్పిళ్ళతో ఇసుక సన్నగా విడుస్తున్నాడు. సన్నటి ఇసుక శంఖాకారంగా రూపు దిద్దుకుంటోంది. కొంతసేపటికి విసుగు పుట్టిందతడికి.

"అమ్మోవ్....! నా కిది దొరికిందేవ్....! ఎంచక్కా మెరుస్తోంది చూడు...."

శివరావు పక్కకు తిరిగాడు. అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. పాప తనకు దొరికిన అర్ధణా బిళ్ళను వాళ్ళమ్మకు చూపిస్తోంది. వాళ్ళమ్మ వినిపించుకోవటంలేదు. ఏదో పత్రిక పుటలని సీరియస్‌గా తిరగేస్తోంది. పాప శివరావు వేపు నడిచింది. శివరావు పోసిన ఇసుక గోపురాన్ని చూస్తూ బిక్కు బిక్కు మంటూ నిల్చుంది.

"పాపా, ఇలా రామ్మా!" అని పిలిచాడు శివరావు.

పాప రాలేదు. శివరావు వేపు అమాయకంగా చూసింది.

శివరావు హృదయం యేడ్చింది.

అచ్చం అరవిందలానే ఉంది.

రెండు జడలు వేసుకుంది. అలానే అమాయికంగా చూసింది, తన తల్లి, తన అమ్మ, తన చిట్టి, తన అరవింద.

చందమామ వాళ్ళో ఆడుకునేందుకు, చుక్కలతో కలిసి నవ్వేందుకు వెళ్లిపోయింది. మళ్ళీ రాదు.

. . . శివరావు కళ్ళలో నీళ్లు తిరిగాయి.

. . . చొక్కాకాలరుతో తుడుచుకున్నాడు.

"శశి ఉత్తరం వ్రాయలేదు. పదిరోజులయింది." అనుకున్నాడు.

"ఇలా రా పాపా, నీకు పిచికగూడు చేసిపెడతాను.''
పాపముఖం వికసించింది.
దగ్గరగా వచ్చి నిల్చుంది.
శివరావు ఇసుకలో గుంటచేసి తడి ఇసుక పైకితీశాడు.
పాప అక్కడే కూచుంది చూస్తూ.
పిచిక గూడు చేశాడు.

"ఇందులో చిన్న పిచ్చుక పిల్లలున్నాయి. వాళ్లమ్మ ఇంకా రాలేదు. అందుకని ఎదురుచూస్తున్నాయి చూడు" అన్నాడు.

పాప వంగి చూపింది. నవ్వింది.
శివరావుకి హృదయం యేడ్చింది.
అరవింద ఇలానే నవ్వేది.

ఇక్కడే అరవిందతో ఎన్నోసార్లు కూచున్నాడు. తడి ఇసుకతో పిచిక గూడులు కట్టాడు. ఎన్ని ప్రశ్నలు వేసేది?

"పాపా, ఇది బాగుందా?"
పాప సంతోషంతో తల వూపింది.
"ఇలా రామ్మా మరి" అన్నాడు.
పాప వచ్చి వళ్ళో కూచుంది.

ఆ చిన్న రెండు జడలు శివరావు గుండెల్ని తాకినవి. అతడి కళ్లు చెమర్చాయి.

అరవింద అచ్చం ఇలానే ఉండేది. మళ్లీ ఎన్నాళ్లకి తన కళ్లలో అరవింద!

"పాపా, నీ పేరేమిటమ్మా?"

"నా పేరు రోజా. మరేమో మా అమ్మపేరు సరోజా. అసలు నాపేరు హేమ. కాని నాన్నగారే....అమ్మపేరు సరోజా. నా పేరు రోజా...."

"పాపా...."

శివరావు ఉలిక్కిపడ్డాడు. ఆ కంఠం కొరడాపెట్టి కొట్టినట్లు ఉంది. అతనికి కొంచెం దూరంలో. కూచున్న ఓ పెద్ద అమ్మాయి పాపవేపు కళ్లెర్రచేసి చూస్తున్నది.

పాప భయపడిపోయింది.

"ఇలారా అన్నది" ఆ అమ్మాయి పాపను.

పాప శివరావు వొళ్ళోంచి లేచింది.

శివరావుకు జాలైంది, పాపను చూసి. దిగులెత్తింది.

పాప అడుగులో అడుగువేసుకుంటూ అమ్మ దగ్గరకు పోయింది. శివరావుకి కెవ్వున అరుద్దామనిపించింది. అపటి వీపున బలంగా బాకు గుచ్చినట్లయింది.

పాపను వాళ్ళమ్మ చెంప మీద వొక్కటి అంటించింది. పాప యేడుపుని దిగమింగుకుని వాళ్ళమ్మ వేపు భయంగా చూసింది.

"పాపిష్ఠిదానా. ఎవరుసిలిస్తే వాళ్ళ దగ్గర కల్లా వెళతావా? ఈ సారి వెళ్లు, చంపేస్తా."

మళ్లీ వొకటి వేయబోయింది. పాప యిక వెళ్ళనని గట్టిగా తల వూపింది. శివరావు కుంగిపోయాడు.

పాపను దగ్గరకు తీసుకుంది వాళ్లమ్మ.

పాప మెళ్ళో గొలుసు చూసుకుంది.

లాలనగా "అలా వెళ్ళకూడదమ్మా. బూచివాళ్లు దగ్గరకు రమ్మని పిలిచి గొలుసు కాజేసి గొంతుపిసికి నీళ్ళలో పారేస్తారు...."

శివరావుకి ఇసుకలో కూరుకుపోతున్న ట్లనిపించింది.

పాప భయంతో వాళ్ళమ్మ గుండెల కతుక్కునిపోతున్నది.

పాపా వాళ్ళమ్మ పాప గుప్పిటను తెరచి అందులోంచి అర్ధణాబిళ్ళతీసి మండిపడ్డది. శివరావు వేపు క్రోధంగా చూసి ఆ బిళ్ళను బలంగా విసిరింది. ఆ బిళ్ళ శివరావు కాళ్ళముందు వచ్చిపడింది.

పాప వీపు మీద వాళ్ళమ్మ మళ్ళీ వొక్కటంటించింది.

పాప బిగ్గరగా యేడ్చింది.

"నోర్ముయ్.........అలా తీసుకోవచ్చా. చెప్పు. తీసుకో వచ్చా...."

పాప "తీసుకోకూడదు" అని తల వూపింది.

శివరావు బలహీనంగా అన్నాడు:"పాపను కొట్టకండి. నేనేం ఇవ్వలేదు. పాపకు దొరికింది ఇసకలో."

పాపా వాళ్ళమ్మ శివరావువేపు అసహ్యంగా చూసింది.
ముళ్లలాగా గుచ్చుకున్నాయి ఆమె చూపులు శివరావును.
పాప ఇంకా యేడుస్తూనే వుంది.
పాపావాళ్ళమ్మ అటు తిరిగి కూచుంది.

శశి ఉత్తరం వ్రాయలేదు. పదిరోజులైంది. ఎందుకో? అనుకున్నాడు శివరావు. అతడి హృదయం మూలిగింది.

పాప నెత్తుకుని వాళ్ళమ్మ శివరావు ముందుగానే నడిచి వెళ్ళిపోయింది.

పోయేటప్పుడు పాప శివరావువేపు భయంగా చూసింది.
"అరవింద ఇలానే వుండేది. అచ్చం ఇలాగే వుండేది. శశినుంచి ఉత్తరం రాలేదు.పదిరోజులైంది." అనుకున్నాడు శివరావు.

చీకటిపడింది.
కళ్లు తుడుచుకుని అతడూ లేచాడు.
అతని చెవుల్లో పాపావాళ్ళమ్మ మాటలు ప్రతిధ్వనించాయి.
"గొలుసు తీసుకుని గొంతు పిసికి నీళ్ళలో పడేస్తారు."
శివరావు దీనంగా నడిచాడు రోడ్డు వెంబడి.

అతడికి దిగులైంది. శశినుంచి వుత్తరం రాలేదు. పది రోజులైంది.

ఇల్లు చేరుకుని తలుపుతీసి స్విచ్ నొక్కాడు.
నేలమీద కవరు కనిపించింది.
ఆత్రుతతో తీసి చదువుకున్నాడు:
"........పాదములకు, నమస్కారములు.

ఇచ్చట నేనూ, నానీ, ఇంకా తక్కినవాళ్లంతా క్షేమం. ఈమధ్య నా వొంట్లో ఏమీ బావుండటంలేదు. రోజురోజుకీ కృంగిపోతున్నాను. ఏమిటో బెంగగా వుంటున్నది. ఇల్లు వేరే చూశారా?

వెంటనే ఇల్లు మార్చండి. ఆ ఇంట్లో నే నుండలేను. వెంటనే ఉత్తరం వ్రాయండి. వెంటనే వచ్చేస్తాను. అక్కడ మీ రెలా ఉంటు న్నారో అనే దిగులుతో చచ్చిపోతున్నాను. నే నిక్కడ వుండలేను. వెంటనే ఉత్తరం వ్రాస్తారుకదూ!

నాలుగురోజులనుంచీ నాని నడిరాత్రి లేచి 'చెల్లాయేదీ? చూపించ'మని యేడుస్తున్నాడు. నే నుండలేను. నేనేం చెప్పేది? వాడి కేం చెప్పాలి. వా డలా అడుగుతుంటే? నేను యేడిస్తే వాడు బేజారెత్తిపోతున్నాడు. మీనుంచి ఉత్తరం రాగానే బయలుదేరి వచ్చే స్తాను........

మీ శశి."

శివరావుకి యేడుపొచ్చింది.

అత డలానే దిగులుగా పడుకొని నిద్రపోయినాడు.

పొద్దున్నే లేచి, అతడిదివరలో చూసి వచ్చిన ఇల్లు తీసు కుంటున్నానని శశికి ఉత్తరం వ్రాశాడు. ఆ ఇంటికి వెళ్ళి తాళంవేసి వెనక్కు తిరుగుతుంటే ఎదురింటి అరుగుమీద పాప కనిపించింది. క్షణంసేపు దిగాలుపడి నిలుచుండిపోయాడు శివరావు. అతడికేమీ తోచలేదు. రోజూ పాపను చూస్తూ తాను బ్రతకలేడు. వెనుకటి సంఘ టనలన్నీ రోజూ మనసులో బాధకలిగింపజేస్తాయి.

పాపా వాళ్ళమ్మకూడ అరుగుమీదకు వచ్చింది.

శివరావు మెట్లు దిగి వీధిలోకి వచ్చాడు.

అతడి వెనకాల పాప అరుస్తున్నది. "అమ్మా! అడుగో బూచి వాడు........"

పాపా వాళ్ళమ్మ అంటున్నది: "తప్పు పాపా! అలా చూప కూడదు. చిన్నగా రహస్యంగా చెప్పాలి."

శివరావుకి దిగులైంది. శశికి పాపను చూస్తే రోజూ ఏడుపు వస్తుంది గాబోలు. భగవంతుడా! అరవింద అక్కడ హాయిగాఉందా? శివరావు దిగులుగా నడిచిపోయాడు.

ఆ సాయంకాలం స్టేషన్‌కు వెళ్ళి ఉత్తరం రైల్లో పోస్ట్ చేసి వచ్చాడు.

శశి వచ్చినరోజే అతడితో ఆఫీసునుంచి వచ్చిన తర్వాత అంది: అతడి జుట్టులోకి వేళ్ళుంచి దువ్వుతూ—

"నా చిన్ననాటి స్నేహితురాలు సరోజ వచ్చింది పురుడు పోసుకోవటానికి. మన యెదురిల్లే. మాకు బలే స్నేహం. వాళ్ళ పాపను చూశారూ—అచ్చం అరవిందే! రెండు జడలు వేసుకుని ఆ పాప నడుస్తుంటే మధ్యాహ్నం నా కేడుపొచ్చింది. ఏడ్చానుకూడా. సరోజ గుచ్చిగుచ్చి అడిగింది. చెప్పాను. మిమ్మల్నేదో అందిట—బీచిలో వోసారి. కళ్ళ నీళ్లు పెట్టుకుంది. మీరు మీరని అనుకోలేదట. అవును నేనుమాత్రం అనుకున్నానా? ఇలా అయిపోయినారేం?"

శివరావు మాట్లాడలేదు.

ఆమె గుండెల్లో తల ఆన్చి అలానే ఉండిపోయినాడు.

మర్రోజు ప్రొద్దున నానీ ఎదురింటి వాళ్ళింటికి ఆడుకునేందుకు పోయినాడు. అవాళ సాయంకాలం ఆఫీసునుంచి వచ్చిన శివరావు తన గదిలో పాపతో ఆడుకుంటున్న నానీని చూశాడు. పాపనలాగే యెత్తుకుని గుండెల కదుముకుని నిట్టూర్చాడు. తలుపుచాటున ఉన్న సరోజ కళ్లు తుడుచుకుంది.

———